తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### సింహ వాహనంపై

# సిరిసంపదల దేవుడు

### వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



చంద్రగిరి, మార్చి 2 ప్రభాతవార్త:
సిరిసంపదల దేవుడు శ్రీనివాసుడు సింహ వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయ ప్రధాన అర్చకులు పార్ధసారధి స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తిని మండ పానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి సింహ వాహనంపై యోగ నరశింహస్వామి వారి అవతారంలో అధిష్టింపజేశారు. మూడవ రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మృగరాజును వాహనంగా చేసుకుని తిరుమాడ వీధులలో ఊరేగారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్స్ తేనెపల్లి వెంకటస్వామి, నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### ముత్యపు పందిరిపై మూలపురుషుడు



శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు రాత్రి భగవంతుడు ముత్యపు పందిరిలో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు వాహన విశేషాన్ని వివరిస్తూ ముత్యం స్వచ్ఛతకు సంకేతంగా నిలుస్తుందన్నారు. ముత్యపు పందిరి వాహనసేవలో స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా భక్తుల ఈతి బాధలు తీరి ప్రశాంతత పొందగలరని అన్నారు.

## నేడు పల్స్ పోలియో చుక్కలు



చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త:
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం పక్కాగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 0–5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పాఠశాలలు, సరివాలయ కార్యాలయాలను పోలియో చుక్కల కేంద్రాలుగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం పోలియో చుక్కల కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. సోమ, మంగళవారాల్లో పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేయనున్నారు.

# విహారంలో విషాదం...!

### విహార యాత్రలకు వెళ్ళి ముగ్గురు విద్యార్థుల గల్లంతు - మహాబలిపురం బీచ్‌లో దుర్ఘటన



సముద్రంలో గల్లంతైన మౌనిష్, ప్రభు, విజయ్ (ఫైల్‌ఫోటోలు)

(ప్రభాతవార్త నెట్‌వర్క్-పలమనేరు, బంగారుపాళెం, సదుం)
విహారయాత్రకు వెళ్లిన పలమనేరు డిగ్రీ కళాశాల విద్యార్థులు ముగ్గురు తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. కళాశాల సెలవుకావడంతో తోటి విద్యార్థులతో కలసి విహార యాత్రకువెళ్లి అక్కడ జరిగినచిన్నపాటి తప్పిదంతో ముగ్గరు విద్యార్థులు మృత్యు వాతపడ్డారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం 18మంది ఓ ప్రైవేటు వాహనంలో తమిళనాడు రాష్ట్రంమహాబలి పురానికి వెళ్లగా అందులో ముగ్గురు విద్యార్థులు సముద్రంలో పడిగల్లంతైనఘటన శనివారం చోటు చేసు కుంది. కళాశాలలో శుక్రవారం మెగా జబ్‌మేళ సందర్భంగా కళాశాల సెలవు ఉండ డంతో బి.ఎస్సీ డిఎహెచ్ 3వ సంవత్సరానికి చెందిన 16 మంది విద్యార్థులు వారితోపాటు మరోఇద్దరు విద్యార్థులు ఓ ప్రైవేటు వాహనంలో శుక్రవారం మహాబలి పురం బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మహాబలిపురంలోని సముద్రం వద్దకు విద్యార్థులు వెళ్లగా వారిలో బంగారు పాల్లె మండలానికి చెందిన మౌనిష్, సదుం మండలానికి చెందిన విజయ్, పులిచెర్ల మండలానికి ప్రభు సముద్రంలో గల్లంతయ్యారు. దీంతో తోటి విద్యార్థుల అక్కడి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టగా విజయ్ మృతదేహం లభించిందని మరో ఇద్దరు మౌనిష్, ప్రభు ఆచూకీకోసం గాలిస్తున్నట్లు సమాచారం.

#### సదుంలో అలుముకున్న విషాదం

శనివారం మహాబలిపురంబీచ్‌లో జరిగినదుర్ఘటనలో బంగారు పాలెం మండలం కేసీ కండ్రిగకు చెందిన మౌనిష్, విజయ్‌లతో పాటు సదుం మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ పెడకంటివారిపల్లెకు చెందిన ప్రభు కూడా మృతి చెందడంతో ఎసదుం మండలంలో తీవ్రవిషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల్లోవిజయ్ మృతదేహాన్ని పోలీసులు వెలికి తీయగా మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. వారికోసం పోలీసులు వెతుకుతున్నారు. కూలి పని చేసుకుని బతుకుతున్న శివరాణికి ఏడేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఇటీవలే కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడిని పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో చేర్పించి చదివిస్తోంది. ఈవిషయం తెలుసుకున్న శివరాణి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. సర్పంచి హనుమంతురెడ్డి, వైకాపాఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు ఆమెను ఓదార్చారు.

# శ్రీవారి లడ్డూప్రసాద ధరలు తగ్గించలేం

### -తిరుపతి-తిరుమల మధ్య బస్సులను నామమాత్రపు ధరకు నడపలేం
### -శ్రీవారి సేవ వారంరోజులే -"డయల్ యువర్ ఈఓ"లో ధర్మారెడ్డి



తిరుమల, మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలేశుని దర్శనం తరువాత అంతటి పవిత్రమైన లడ్డూ ప్రసాదం ధర తగ్గించాలని, పరిమాణం తగ్గిందని అడిగిన భక్తుని ప్రశ్నకు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి స్పందించారు. స్వామివారి లడ్డూ ధర తగ్గించలేమన్నారు. తిరుపతి-తిరుమల మధ్య బస్సులను నామమాత్రపు ధరకు నడపాలని, 18 కిలోమీటర్ల దూరానికి 90రూపాయలటిక్కెట్ వసూలు చేయడం భక్తులకు భారంగా మారిందని మరో భక్తుడు అన్నారు. ఈ ప్రశ్నకు ఈఓ స్పందిస్తూ టిటిడికి సాధ్యంకాదన్నారు. గతంలో శ్రీవారి సేవ ఐదురోజులు ఉండేదని, వారంరోజులు చేశారని మరో భక్తుడు అడిగారు. దీనికి సమాధానంగా రెండు రోజులు సేవలపై సేవకులు అవగాహన కల్పించుకుని మరో ఐదురోజులు చక్కటి సేవలందిస్తున్నారన్నారు. శనివారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఈఓ"కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలనుండి భక్తులు అడిగిన ప్రశ్నలకు, సూచనలుసలహాలు స్వీకరిస్తూ ఈఓ ధర్మారెడ్డి సమాధానాలిచ్చారు. తిరుమలకు వచ్చిన వయోవృద్ధులు, దివ్యాంగులకు భార్య/భర్త గాకుండా వారి కుటుంబసభ్యులను అనుమతించండని హైదరాబాద్ నుండి సౌజన్యకోరారు. దీనిపై ఈఓ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు. ఇంకా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అలాగే తిరుమలలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దర్శనం, లడ్డూల విక్రయాలపై ఈఓ సావధానంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్, డిప్యూటీ ఈఓ భాస్కర్, డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాస్, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, డిఇఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, పిఆర్ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి
## శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు



శ్రీకాళహస్తి- ప్రభాతవార్త
పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను అనుమతించిన బడ్జెట్ లోపల 'నభూతో'అన్నట్లు నిర్వహించనున్నట్లు వివరించారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా బ్రహ్మోత్సవాలు అంటే పది రోజుల పాటు నిర్వహించటం జరుగుతోందని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించటం సంప్రదాయమని వివరించారు. మొదటి ఉత్సవాన్ని భక్తజన వల్లభుడు భోళాశంకరుడు వాయులింగేశ్వరుడు 'భక్తకన్నప్ప' ధ్వజారోహణానికి ఇవ్వటం గమనించదగ్గ విషయం అన్నారు. స్థానిక నాయకులు, భక్తుల సూచనల మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. గత ఏడాది రెండు లక్షల మంది భక్తులు వచ్చినట్లు అంచనా కట్టారని ఈ ఏడాది రెండున్నర లక్షల మంది వస్తారని అంచనా వేసి ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. ఆదివారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. సాయంత్రం ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక నాయకుడు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి హాజరౌతారని వివరించారు.

### ఆలయంలో పూల సొబగులు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆలయంలో పూల సొబగులకు బెంగుళూరు నుంచి పూలను తెప్పించారు. అలాగే స్వామి అమ్మవార్లకు అలంకారాలకు పూలను స్థానిక వ్యాపారుల నుంచి సేకరిస్తున్నారు. ఆదివారం భక్త కన్నప్ప ధ్వజారోహణానికి సంబంధించి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయాన్ని పూలతో ముస్తాబు చేయటానికి పనులు చక చకా సాగిస్తున్నారు. ఇక లైటింగ్ పనులు, ముగ్గుల అలంకరణలు పూర్తి చేసారు. పనులకు సంబంధించి ఆలయ ఇఓ నాగేశ్వరరావు, ఎఇఓ ధనపాల్, ఇఇ నూకారత్నంలు పర్యవేక్షిస్తున్నారు.

# సర్దుకుపోండి.. ప్లీజ్...!

### సమస్య వస్తే నా దగ్గరకు రండి
### - అసమ్మతి వర్గీయులకు మంత్రి పెద్దిరెడ్డి హామీ



ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సూళ్లూరుపేట, మార్చి 2 ప్రభాతవార్త
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబంలాంటిదని, సమస్యలు వస్తే సర్దుకుపోవా లని, దీన్నిదృష్టిలో ఉంచుకొని స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, పార్టీ నేతలు, కార్య కర్తలు సర్దుకుపోవాలని, ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావా లంటూ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పివిఆర్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి, పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఇక్కడ ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న సంజీవయ్య గతంలో మంచి మెజార్టీతో గెలిచారని, అదే మెజార్టీ తిరిగి వచ్చేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన కోరారు. కుటుంబం అన్నాక గొడవలు వస్తుంటాయని, వీటన్నింటినీ చక్కదిద్దాల్సిన బాధ్యత సంజీవయ్యపై ఉందన్నారు. పాతమిత్రులను దగ్గరకు చేరుకొని వారికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఏదైనా పొరపచ్చలు ఉంటే వాటిని సరిదిద్దుకొని ముందుకు పోవాలని సంజీవయ్యకు చెప్పారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉన్న సంజీవయ్య పార్టీలో పరిస్థితిని అర్థం చేసుకోగలడని మంత్రి తెలిపారు. తిరుపతి జిల్లాకు సంబంధించి సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలు కొత్తగా చేరాయని, ఈ మూడు నియోజకవర్గాలను సీఎం ఆదేశాల ప్రకారం తాను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా సూళ్లూరుపేట పరిస్థితి బాగా లేదన్నా.. మీరు వెళ్లి చక్కదిద్దండి అంటూ తనకు చెప్పడంతో ఇక్కడి రావాల్సి వచ్చిందని తెలిపారు. ఇక్కడి కొంతమంది ముఖ్య నాయకులతో తాను సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నానన్నారు. ఇకమీదట ఈ పరిస్థితి రాకుండా తాను చూసుకుంటానని, తిరుపతిలో అందుబాటులో ఉంటానని, సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని పార్టీ శ్రేణులను కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా భారీ మెజార్టీ రావాలంటే ఇక్కడి నుంచే పార్టీ అభ్యర్థి సంజీవయ్య మంచి మెజార్టీ వచ్చే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. సంజీవయ్యతో తిరిగి సమస్యలు ఏర్పడితే తన దగ్గరకు తీసుకురండి, తనకు కూడా సాధ్యం కానప్పుడు సీఎం దృష్టికి తీసుకెళతానని పెద్దిరెడ్డి చెప్పారు. అలాగే ఆయన ఎమ్మెల్యే సంజీవయ్యకు సున్నితంగా మాట్లాడుతూనే పార్టీ క్యాడర్‌ను ఇబ్బందులు పెట్టవద్దంటూ హెచ్చరిక జారీ చేశారు. గ్రూపులు కట్టడం మంచి పద్ధతి కాదంటూ ఆయన పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దువ్వూరు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీలో తనకు ఎటువంటి ఇబ్బంది లేదని, సంజీవయ్యతో భేదాభిప్రాయాలు లేవన్నారు. కానీ తనతో ఉన్న నేతలకు మాత్రం ఇబ్బందులు ఉన్నాయన్నారు. కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంజీవయ్య తెలుగుదేశం నుంచి వచ్చిన నాయకులను ప్రోత్సహిస్తూ తమను అష్టకష్టాల పాల్జేశాడని మంత్రికి చెప్పారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ తనను వ్యక్తిగతంగా ఇబ్బందిపెట్టడంతో పాటు తనతో ఉన్న వారిని కూడా సంజీవయ్య ఇబ్బందులకు గురిచేశారన్నారు. కానీ తామంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న దృఢ సంకల్పంతో అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని సభలో పాల్గొన్న నేతలందరూ సంయుక్తంగా చెప్పారు.

#### తప్పు చేసి ఉంటే మన్నించండి

తనకు తెలిసి తాను ఎటువంటి తప్పు చేయలేదని, ఒకవేళ తప్పు చేశానని మీరు భావిస్తే తనను మన స్ఫూర్తిగా మన్నించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ శ్రేణులను కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకుంటానని ఆయన చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాటకు కట్టుబడి ఉంటానని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.

# ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

### 40 మందికి గాయాలు
### శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



నాయుడుపేట (పెళ్లకూరు), మార్చి 2 ప్రభాతవార్త
తిరుపతి-నాయుడుపేట రహదారిలోని పెళ్లకూరు మండలం టెంకాయతోపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలోఆర్టీసీ బస్సులోని 40 మంది ప్రయాణికులకు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. రాపూరు డిపోకి చెందిన ఆర్టీసీబస్సు నెల్లూరు నుంచితిరుపతికి 55 మంది ప్రయాణికులతో బయలు దేరింది. ఇదే క్రమంలో తిరుపతినుంచి నాయుడుపేట వైపు వేగంగా వస్తున్న లారీ టెంకాయతోపు వద్ద బస్సును ముందు వైపు ఢీకొనడంతో బస్సు బోల్తాపడి 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ సైతం గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్నపెళ్లకూరుఎస్ఐ శ్రీకాంత్ ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యంకోసం శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేప ట్టారు. ఈ ఘటనలో లారీ సైతం బస్సును ఢీకొని పంట పొలాల్లోకి వెళ్లినప్పటికీ ఎవరికీ ప్రాణాపాయ స్థితి లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# సంక్షేమ పథకాలను నిర్దేశిత గడువులోపు పురోగతి సాధించాలి

### జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా



తిరుపతి కార్పొరేషన్, మార్చి 2, ప్రభాతవార్త
మూడవ విడత రీ సర్వే, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం అమలు, త్రాగు నీటి ఎద్దడి రాకుండా తీసుకుంటున్న చర్యలు తదితర సంబంధిత అంశాలపై ప్రణాళిక బద్ధంగా పనిచేసి నిర్దేశిత గడువులోపు పురోగతి సాధించాలని, ఆరోగ్య శ్రీ కార్డులు శత శాతం పంపిణీ జరగాలని, జిల్లాలో పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం సిఎం క్యాంపు కార్యాలయం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వర్చువల్ విధానంలో ఫేజ్ 3, రీ సర్వే, ఇనామ్, ఫ్రీ హోల్డ్ ఆఫ్ అసైన్డ్ భూములు, పేదలందరికీ ఇళ్ళు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం అమలు, వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా తీసుకుంటున్న చర్యలు, వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమంకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష, సంతృప్తి స్థాయిలో అర్హులైన అందరికీ ఆరోగ్యశ్రీ కార్డుల డిస్ట్రిబ్యూషన్, పరిశ్రమలకు భూ కేటాయింపు పెండింగ్ అంశాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్ ఏర్పాటు పురోగతి, ధాన్యం సేకరణ, పల్స్ పోలియో అంశాలపై కలెక్టర్ల స్పందన వంటి పలు అంశాలపై సంబంధిత కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా అధికారులతో కలిసి హాజరైయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పథక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి విజయ్ కుమార్, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకర నారాయణ, డిఎంహెచ్ఓ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన : ఎన్నికల అధికారి జి.లక్ష్మీ షా

ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా వారి మార్గదర్శకాలు మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల 2024 నిర్వహణకు నామినేషన్ ప్రక్రియ మార్గదర్శక ప్రణాళికపై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సి విజల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ తదితర అంశాలపై ఈవిఎంపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీ షా అవగాహన కల్పించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఈఆర్ఓలతో కలిసి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 తుది జాబితా అభ్యంతరాలపై, ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల మార్పులు, ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు తదితరాలపై వివరించి నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహణ కొరకు చర్యలు చేపడుతున్నట్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన వివరించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థుల ఎన్నికల వ్యయం కొరకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్, చెక్ బుక్‌లను నామినేషన్ వేసే ముందు రోజు లోపు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాలో 61 పోలింగ్ స్థానాల మార్పుకు, 80 పోలింగ్ కేంద్రాల పేరు విధానం మార్పు, ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు 6 కొరకు పంపడం జరుగుతుందన్నారు.




# పూజల్లో అగ్రతాంబూలం -అభివృద్ధిలో ఆగ్రపీఠం

## నేడు భక్త కన్నప్ప ధ్వజారోహణం



(శ్రీకాళహస్తి: ప్రభాతవార్త)

పూజల్లో భక్తకన్నప్పకు అగ్రతాంబూలం. అభివృద్ధిలో అగ్రపీఠం భక్తకన్నప్ప కొండకు ఇచ్చారు. పురాతన కాలం నాటి చిన్నపాటి ఆలయంతో సతమతమయ్యే వారు. ప్రస్తుతం భక్తకన్నప్ప కొండపై కొత్తగా ఆలయం నిర్మించిన ఆలయంలో ఉత్స వాల్ని నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తి అంటే ఏ భక్తునికి అయినా మూడు మూగజీవాలతో పాటు మొదట గుర్తొచ్చేది భక్తకన్నప్ప. తన కన్నులను ముక్కంటీ శునికి ఇచ్చి మోక్ష ం పొందిన ఓ వేటగాని వృతాంతం ఎవరికైనా గుర్తుకొస్తుంది. ఇక్కడి ఆలయంలో నిర్వహించే పూజల్లో అగ్రతాంబూలం కైలాసనాధుడు తన భక్తుడైనా తిన్నడికి ఇచ్చాడు. తాను కొండ కింద వెలిసి తన భక్తుడు భక్తన్నప్పకు కైలాసగిరి పర్వతపంక్తులో శిఖరాగ్రంలో అవకాశం కల్పించాడు. దీనిని బట్టి శివయ్య భక్తులకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాడో అర్ధమవుతుంది. ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు హారతి ఇచ్చిన తరువాత అర్చకులు భక్తకన్నప్ప విగ్రహాన్ని చూపుతారు. దీనిని బట్టి కూడా భక్తకన్నప్ప ప్రాధాన్యత అర్ధమవుతుంది. అంతేకాక శ్రీకాళహస్తిలో ప్రస్తుతం ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయం పూర్వం భక్తకన్నప్ప ఆలయమని చెబుతారు. శ్రీకాళహస్తిని పరిపాలించిన రాజులు 'వైష్ణవాభిమానులు' కావటంతో వారు నివాసముండే రాజభవనాలకు సమీప ంలో రాణులు వెళ్ళటానికి అనుకూలంగా ప్రసన్నవరదరాజస్వామి ఆలయాన్ని నిర్మించటానికిగాను ఇక్కడి భక్తకన్నప్ప విగ్రహాన్ని ప్రస్తుతం పూల దుకాణాలవద్ద ఉన్న చోటుకు మార్చినట్లు చెబుతారు.

**భక్తకన్నప్ప జన్మస్థలం ఉడమలపాడు:**

ముక్కంటీశుని కన్నులర్పించిన భక్తుడు కన్నప్ప జన్మస్థలం శ్రీకాళహస్తి పట్టణానికి సుమారు పదికిలోమీటర్ల దూరంలో ఉడమలపాడుగా చెబుతారు. ఇక్కడ జన్మించిన ఆయన అడవుల్లో సంచరిస్తు శివసాయుజ్యం పొందినట్టు స్థల పురాణంలో పేర్కొనబడింది. . శ్రీకాళహస్తీశ్వరాలయాభివృద్ధితో పాటు భక్త కన్నప్ప ఆలయాభివృద్ధి ప్రణాళికా బద్ధంగా సాగుతుంది. ఒక నాడు ఈ కొండపైకి వెళ్ళాలంటే సరైన దారి ఉండేది కాదు. కానీ నేడు సుమారు రూ. 3కోట్లతో ఈ కొండపైకి లోబావి నుంచి దారిని ఏర్పాటు చేశారు.. కొండపై వెలసినా ఆలయం చుట్టూ ప్రక్కల సుమారు 15 కిలోమీటర్ల దూరంలో గ్రామాలకు దర్శనిమిస్తుంది. కాబట్టి ఇక్కడ సుమారు రెండుకోట్ల రూపాయలతో శివపార్వతుల విగ్రహాల్ని 50 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. అంతేకాక 11 శతాబ్దం నాటి ఆలయంగా చెబుతారు.స అనునిత్యం కర్ణాటక, తమిళనాడు నుంచి విశేషస్థాయిలో భక్తులు వస్తారు.

**నేడు ధ్వజారోహణం:**

ఎంతో పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న 'భక్తకన్నప్ప' ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణంతో అంకురార్పణ చుడతారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణం ఏర్పాటు చేశామన్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరౌతారనే అంచనాలతో ఏర్పాట్లను చేపట్టారు.

## నేటి నుంచి భక్తుల సేవలకు స్వస్తి- ఉభయదారులు దేవస్థానమే

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి అంటే మహాసంబరం. ఎన్నో మార్పులు, ఎన్నో సవరణలతో సాగుతుంటాయి. ఏ ఏడాదికా ఏడాది కొత్తదనం సంతరించుకుంటుంది. పదమూడు రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం సాయంత్రం పట్టణంలో పంచ మూర్తుల ప్రదర్శనలు, పట్టణాన్ని శోభాయ మానంగా అలంకరించటం. శివరాత్రి బ్రహ్మోత్స వాల్ల ఆలయంలోని మూల విరాట్టుల సేవ కన్నా ఉత్స వాలకే ప్రాధాన్యత అని చెప్పవచు ్చ.

## మహాశివరాత్రి ఉత్సవాల్లో నేడు1వ రోజు 03.03.2024

### శ్రీ భక్తకన్నప్ప ధ్వజారోహణం-అంకురార్పణ

మాఘ బహుళ అష్టమి ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి ప్రారంభం ఉభయదాతలు-శ్రీ బోయ కులస్థుల వారి సంఘం, సన్నిధివీధి, శ్రీకాళహస్తి.

### ధూర్జటి కళా ప్రాంగణంలో నేడు

-శ్రీ భక్తకన్నప్ప ధ్వజారోహణం-

సాయంత్రం 7గం. నుంచి – విశిష్ట అతిధులు, గౌరవ అతిధులచే వేదమంత్రాలతో ధూర్జటి కళా ప్రాంగణం వేదిక జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం.

రా॥8 గం.లకు- శివ మల్లాది డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, కలకత్తా, నాట్యకళాసాగర్ మొహుల్ ముఖర్జీ వారిచే భరత నాట్య ప్రదర్శన

రా. 9గం.లకు- జవహర్ బాల భవన్, హైదరాబాదు వారిచే నృత్య ప్రదర్శన

రా.10గం.లకు- మయూరి డ్యాన్స్ అకాడమి, మెదక్, యం.సుప్రియ బృందంచే నాట్య ప్రదర్శన

రా.11గం.లకు- శ్రీ నటరాజ నాట్యమండలి, కె.నీలకంఠం వారిచే మోహినీ భస్మాసుర' నాటకం

## నేటి నుంచి బ్రహ్మోత్సవాల్లో పంచమూర్తుల ప్రదర్శనలు

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్స వాలంటే ఎంతో సంబరం. చుట్టుపక్కల జనానికి పండగ వాతావరణం. ఈ ప్రాంతాల్లో శివరాత్రి అంటే 'తిరునాళ్ళు' అని నేటికీ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలు వ్యాఖ్యానించటం ప్రత్యేకం. ఇక ఉత్స వాల్లో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం జరిగే ఉత్స వాలను భక్తులు విశేషంగా చూస్తారు. స్వామి అమ్మవార్లను రెండు వేళల్లో దర్శించుకునే భాగ్యం కల్గిందని సంబరపడతారు. అయితే ఈ ఉత్స వాల్లో కూడా ప్రత్యేకత ఉంది. ఉత్స వాల్లో ప్రతిరోజూ పంచ మూర్తుల ప్రదర్శనలుంటాయి. ఇదో ప్రత్యేకాకర్షణగా కనబడుతోంది. ఉత్స వాల సందర్భంగా పగలు ఒక వాహనంపై రాత్రి వెండి వాహనాలపై ఊరేగించటం మరో ఆనవాయితి. ఇక సాధారణంగా ఉత్స వాల్లో స్వామి అమ్మవార్లను నాలుగుమాడా వీధుల్లో మాత్రం ఊరేగించటం జరుగుతోంది. కాని శివరాత్రి బ్రహ్మోత్స వాలంటే పంచమూర్తుల్లో ఓ ఆకర్షణ కాగా 13రోజుల పాటు స్వామి అమ్మవార్లు సినిమా వీధి, బాబూ అగ్రహారాల్లో ఊరేగించటం మరో విశేషం. ఇక్కడ నారదపుష్కరిణి ఉంది. దీనినే బాబూ అగ్రహారం కోనేరు అంటారు. దీని చుట్టూ స్వామి అమ్మవార్లు ప్రదక్షిణగా సాగుతారు. రెండువేళల్లో స్వామి అమ్మవార్లను దర్శించుకోవటం పూర్వ జన్మ సుకృతం అని పట్టణ ప్రజలు భావిస్తారుపగలు సాదాసీదాగా దర్శనమిచ్చే స్వామి అమ్మవార్లు రాత్రి వేళ ఉత్స వాల్లో ఎంతో చక్కగా ముస్తాబు అయి గగుర్పాటు కల్పించే వాయిద్యాలతో సాగుతారు.

## లోకేష్ శంఖారావం సభ స్థలాన్ని పరిశీలిస్తున్న గాలి భానుప్రకాష్



నగరి రూరల్, మార్చి 2 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభ ఈ నెల 9 నగరి నియోజకవర్గ స్థాయిలో జరగనున్న నేపథ్యంలో శనివారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భానుప్రకాష్ సభ స్థలాన్ని పరిశీలించారు. నగరి మున్సిపాలిటీ దేశమ్మ ఆలయ సమీపంలో శంఖారావం సభా స్థలం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అంతరిక్ష కేంద్రంలో వైభవంగా భక్తి కార్యక్రమాలు



శ్రీహరికోట (తడ), మార్చి 2 ప్రభాతవార్త : అంతరిక్షంలోకిఅలవోకగా రాకెట్లనుపంపించడమే కాకుండా పర్వదినాల సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీహరికోటలో పూజలు నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలలో ఈ సారి షార్‌లోని శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళేశ్వరస్వామి టెంపుల్ కాంప్లెక్స్‌లో రాధాకృష్ణచంద్ర కల్యాణ మహోత్స వం నిర్వహిస్తున్నారు. ప్రాచీన భజన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అభిషేకం తో పాటు గురుకీర్తన భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆదివారం రాధాకృష్ణ కల్యాణం ఉద యం నుంచి మధ్యాహ్నం వరకు జరుపుతున్నారు. సెలవు రోజులు కావడంతో షార్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాలకు నియమనిష్టలతో హాజరవుతున్నారు.

## సునీతరెడ్డి ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమేదీ

-మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 2, ప్రభాతవార్త: వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో జరుగుతున్న పరిణామాలపై వైఎస్ సునీతరెడ్డి వేస్తున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించలేదంటు మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రశ్నించారు. స్థానిక టిడిపి పార్టీ కార్యాయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివేకా హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలని, రాజకీయ లబ్ధికోసమే వైఎస్ వివేకానందరెడ్డి హతమార్చడం జరిగిందనే విషయం జగమెరిగిన సత్యమన్నారు. సిబిఐ విచారణ పిటిషన్ వేస్తానని వైఎస్ సునీత అంటే జగన్ ఎందుకు ఆపారో ఆయన సమాధానం చెప్పాలన్నారు. అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు వివేకానందరెడ్డి హత్య కేసు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని నేడు తన సోదరి సునీత అడుగుతున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చోప్పాల్సిన అవశ్యం ఉందన్నారు.

## 0-5చిన్నారులకు...పోలియో చుక్కలు వేయిద్దాం

-అవగాహన ర్యాలీ



తిరుమల, మార్చి 2ప్రభాతవార్తప్రతినిధి: దేశవ్యాప్తంగా నేడు నిర్వహిస్తున్న పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి ముందు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ తిరుమలలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం ఎస్వీఉన్నత పాఠశాల నుండి ఈ ర్యాలీ బాలాజీనగర్ వరకు సాగింది. మొత్తం 25కేంద్రాలు ఏర్పాటుచేసి తిరుమల సందర్శనలో ఉన్న, స్థానికంగా ఉన్న 0–5ఏళ్ళలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వనీ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి, టిటిడి డిఈఓ భాస్కర్‌రెడ్డి, హెడ్‌నర్సు సావిత్రమ్మ, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూర్యచంద్రప్రభలపై కపిలేశ్వరుడు అభయం



తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త: ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారు వాహనమండపం వద్ద నుండి ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణ చేశారు. భక్తులు శివనామ స్మరణలతో కపిలతీర్థం పరిసరాలు పులకించాయి. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్ర బాబు, ఎఇఒ సుబ్బరాజు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధంకండి:కేంద్రమంత్రి మురుగన్



తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త: జరగనున్న ఎన్నికలకు తిరుపతి జిల్లాలో పార్టీ కేడర్ సన్నద్ధంకావాలని కేంద్రమంత్రి మురుగన్ నిర్దేశించారు. తిరుమల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం తిరుపతికి విచ్చేసిన కేంద్రమంత్రి మురుగన్‌కు తిరుపతి జిల్లా బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్ ,దీపక్‌యాదవ్ స్వాగతం పలికి దుశ్శాలువతో సన్మానించారు.

## నగరంలో శనివారం సాయంత్రం... గోవిందనామసంకీర్తన



తిరుపతి, మార్చి 2 ప్రభాతవార్త: ఆధ్యాత్మికక్షేత్రం తిరుపతి నగరంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు శనివారం సాయంత్రం వేడుకగా గోవింద నామసంకీర్తన చేసి నగరవాసుల్లో భక్తిభావాన్ని చాటారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, విద్వాన్ కస్పా పద్మనాభం, కెఎన్ రాజా, రెడ్డప్ప, తిరుపాలాచారి, ధనుంజయరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఆటో పద్మనాభం, సాగర్‌రెడ్డి, గంజి, కసవనూరు వాసు తదితరులు పాల్గొని నుదుటిన తిరునామం ధరించి గోవింద నామాలతో నగరంలో ఊరేగింపుగా భజనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

## పోలియో చుక్కలు వేసి... పోలియోను తరిమేద్దాం



పోలియో రహిత సమాజం తీర్చిదిద్దడంలో భాగంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయిద్దామని రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీస్, ఆశవర్కర్లు ర్యాలీనిర్వహించారు. జిడినెల్లూరు అక్కన్నగారిపల్లిలో ర్యాలీ జరిగింది.

ప్రభాతవార్త-చిత్తూరు

## మహంతు అక్రమాలపై విచారణ



హథీరాంజీమఠం కస్టోడియన్‌గా వ్యవహరించిన అర్జున్‌దాస్ మహంతు హయాంలో అక్రమాలపై విచారణకు దేవాదాయ శాఖ, మఠం కస్టోడియన్ తనిఖీలు చేశారు. శనివారం తిరుమలలోని మఠంలో పోలీసుల ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేశారు.

ప్రభాతవార్త-తిరుమల

## పిఎఫ్, ఈఎస్ఐ నిధులు స్వాహా...ఒకరు అరెస్టు

సత్యవేడు, మార్చి 2, ప్రభాతవార్త: శ్రీసిటీ పరిధిలో కార్మికులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఈఎస్ఐ నిధులను స్వాహాచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు శ్రీసిటీ సిఐ భాస్కర్ తెలిపారు. చెరివి పంచాయితీకి చెందిన సి ప్రసాద్ మహి మ్యాన్ ఫవర్ సర్వీస్ అనే సంస్థ ద్వారా శ్రీసిటీలోని డైకీ అల్యూమినీయం పరిశ్రమకి కార్మికులను సరఫరా చేసేవాడు. ఇతను గత ఏడాది జనవరి నుంచి డిశంబరు వరకు కార్మికులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఈఎస్ఐ నిధులు సుమారు రూ॥ 38 లక్షల వరకు స్వాహా చేసినట్లు విచారణలో తేలిందని సిఐ భాస్కర్ తెలిపారు. డైకీ అల్యామినీయం పరిశ్రమకు సంబంధించి ఎస్‌కె ఖాజా రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సి ప్రసాద్‌పై సెక్షన్ ఐపిసి 406,409 కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నిందితుడు ప్రసాద్‌ను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు. ఈకేసులో ఇదే కంపెనీలో పనిచేస్తున్న వినోద్ పై కూడా అనుమానాలు ఉన్నాయని విచారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి సేవలో మేయర్ దంపతులు



తిరుపతి కార్పొరేషన్, మార్చి 2 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని పట్నూలు వీధిలో వెలసిన శ్రీ రేణుకా పరమేశ్వరి అమ్మవారి 2024వ వార్షిక మహోత్స వాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్నూలు వీధిలో శనివారం మధ్యాహ్నం అమ్మవారిని నగర మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు మేయర్ దంపతులుకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేసారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేసారు.

## గణనాధుని సేవలో జడ్పీ ఛైర్మన్



కాణిపాకం, మార్చి 2 ప్రభాతవార్త: జడ్పీ ఛైర్మన్ గోవిందప ్ప శ్రీనివాసులు శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.

## వివాహిత ఆత్మహత్య!

గుడుపల్లె, మార్చి 2 ప్రభాతవార్త : పెళ్లై ఏడాది గడిచిన కాలంలోనే ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోటచెంబగిరిలో వెలుగు చూసింది. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని ఒంటిపల్లికి చెందిన లక్ష్మి కోటచెంబగిరికి చెందిన లోకేష్‌ను ఏడాది క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఏం జరిగిందో తెలియదు గానీ లక్ష్మి తమ ఇంట్లో ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేశారు.

## సిద్ధం సభకు భారీగా జనసమీకరణ

నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, మార్చి 2, ప్రభాతవార్త : ఈ నెల 10వ తేది మెదరమెట్లలో జరిగే సిఎం జగన్మోహన్ రెడ్డి భారీగా జనసమీకరణ చేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్ల సన్నాహక సమావేశంలో రామ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వెంకటరమణ బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నప్రయోజనాల కోసమే... జనసేనాని చారిత్రక నిర్ణయం

ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు -డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్



తిరుపతి హెల్త్, మార్చి 2 ప్రభాతవార్త : జనసేనలో పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించే అర్హత ఎవరికీ లేదని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేసారు. ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఆయన చారిత్రక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆయన తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పార్టీ పెట్టి సొంత డబ్బుతో ఎన్నో కార్యక్రమాలు చేసిన మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని వారంతా ఇప్పుడు అవాకులు చెవాకులు పేలితే వారికి సరైన బుద్ధి చెబుతామన్నారు. తాడేపల్లిగూడెం సభలో ఓ పక్క అధికారాన్ని అనుభవించిన టిడిపి నేతలు కూర్చుంటే వారితో సమానంగా రబ్బరు చెప్పులు వేసుకున్న నాయకులను పవన్ కళ్యాణ్ వేదికపై కూర్చోబెట్టారన్నారు. జనసేనపై విమర్శలు చేసే వారు నోరు అదుపులో పెట్టుకోవాలని ఆయన హెచ్చరించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గాలి భానుప్రకాష్



నగరి, మార్చి 2 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ నెత్తం కండ్రిగ దళితవాడ, రాసాతికి చెందిన ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో సంఘటన జరిగింది. దుస్తులు, బియ్యం, సామగ్రి, బీరువాలో ఉన్న అన్ని డాక్యుమెంట్లు అగ్నికి దహనం అయ్యాయి. ఆమె భర్త చనిపోయారు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిరాశ్రయులు అయ్యారు. శనివారం నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వెంటనే అధికారులు ఆదుకోవాలని ఆయన కోరారు.

## పేదల చిరునవ్వులో భగవంతుని చూస్తున్న నేత జగనన్న - మంత్రి



నగరి, మార్చి 2 ప్రభాతవార్త: పేదల చిరునవ్వులో భగవంతుని చూస్తున్న నేత జగన్మోహన్‌రెడ్డి అని మంత్రి రోజా అన్నారు. శుక్రవారం మండలంలోని దామరపాకం గ్రామంలో సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ఆర్ విగ్రహాన్ని, గడప గడపకు నిధులు రూ.10.80లక్షల నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును, మండల నిధులు రూ.4.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.9.52 లక్షల నిధులతో జలజీవన్‌మిషన్ పథకంలో చెర్లోకండ్రిగ నుంచి టీవీ కండ్రిగ, దామపాకం, ఎస్టీకాలనీ, దామరపాకం దళితవాడలకు పైపులైన్ ద్వారా సరఫరా చేసే మంచినీటి పథకాన్ని ఆమె ప్రారంభించారు. మూడు దశాబ్దాల తాగునీటి సమస్యను పరిష్కరించారంటూ స్థానిక మహిళలు పూల వర్షం కురిపించి మంత్రిని ఆహ్వానించారు. గ్రామ పెద్దలు యువకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొండ అంచుల నుంచి తాగునీటికి నాలుగు పంచాయతీలు, 16 హేబిటేషన్లు దాటి 12 కి.మీ దూరం వరకు పైపులైన్ ఏర్పాటు చేయవలసి వచ్చిందన్నారు. ఈ పథకంలో నగరి మండలంలో బుగ్గ అగ్రహారం, దామరపాకం, నంబాకం, డి అగరం పంచాయతీలకు నింద్ర మండలం జీఎన్ కండ్రిగ పంచాయతీకి తాగునీరు అందుతుందన్నారు. మొత్తం పనులకు రూ.67.22 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, ఎంపీటీసీ జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌నాయుడు, నాయకులు హరిరెడ్డి, గణపతిశెట్టి, సునీల్‌రెడ్డి, విజయరెడ్డి, ధనశేఖర్, భాగ్యరాజ్, పాండియన్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అరుణాచలరెడ్డి, రవికుమార్, షణ్ముగరెడ్డి, మునస్వామిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నయ్యరెడ్డి, గురుమూర్తి, ధర్మలింగం, మురగయ్య, రమేష్, సోమనాథం, ఏళుమలై, తంగరాజు, తిరుమలరెడ్డి, బుజ్జిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సికె అనుచరులపై పోలీసులు వేధింపులు

- బైండోవర్ పేరిట టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు సికె అనుచరులు తరలింపు
- సికె టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత



చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే సికె బాబు తన రాజకీయ నిర్ణయంపై అనుచరులు, అభిమానులతో ఆదివారం సమావేశం కానున్న నేపథ్యంలో చిత్తూరు పోలీసులు మాజీ ఎమ్మెల్యే సికె బాబు అనుచరులను వేధించడం ప్రారంభించారు. ఎన్నికలకు ముందే చిత్తూరులో రాజకీయ వాతావరణం వేడెక్కడంతో టుటౌన్ పోలీసులు శనివారం తెల్లవారుజాము చిత్తూరు నగరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు అనుచరులైన జయకుమార్, నారాయణరెడ్డి, షేరు, కుయ్యా, సూరి, సురేష్, శేఖర్‌లను టుటౌన్ పోలీసులు నిర్బంధించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎన్నికల వాతావరణం ప్రారంభం కావడంతో నగర పరిధిలోని రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నట్లు పోలీసులు చెప్పి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించారు. అయితే మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులను ఆహ్వానించడానికి పోలీసులు బైండోవర్ చేసిన వారు ఫోన్ల ద్వారా ఆహ్వానించినట్లు సమాచారం. తన అనుచరులను టుటౌన్ పోలీసులు నిర్బంధించారని తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే సికె బాబు టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులతో వాగ్వివాదంకు దిగారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సికె బాబు పోలీసులతో మాట్లాడుతూ తన అభిమానులు రౌడీలు, గుండాలు కారని వారిని వేధిస్తూ తాను సహించబోనని స్పష్టం చేశారు. దీనిపై పోలీసులు మాజీ ఎమ్మెల్యే సికె బాబుకు సమాధానం ఇస్తూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలువురు వ్యక్తులను బైండోవర్ చేసి విడిచిపెడ్తున్నామని, తమకు ఇతర ఉద్దేశాలు ఏమి లేవని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఒక్కసారిగా చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోకి రావడంతో దర్గా సర్కిల్ ప్రాంతంలో కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## నేడు సికె మద్దతుదారులతో ఆత్మీయ సమావేశం

చిత్తూరు, మార్చి 2 ప్రభాతవార్త: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె బాబు రాజకీయ నిర్ణయం తీసుకోవడానికి ఆదివారం ఉదయం 10 గంటలకు కట్టమంచిలోని తన కార్యాలయంలో తన మద్దతుదారులు, అభిమానులు, అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సికె బాబు తన మద్దతుదారులు, అభిమానులు, అనుచరులతో చర్చించి తన రాజకీయ నిర్ణయంను వెల్లడించనున్నారు. మాజీ ఎమ్మెల్యే సికె బాబు ఏ నిర్ణయం తీసుకొంటారనే విషయంపై చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల్లో ఆసక్తి నెలకొంది.